




అధికారం ఉందన్న అహంకారం.. ఎవరిపై ఎలాంటి దాడులు చేసినా ఏం కాదులే అన్న ధీమా అన్నింటికీ 'అన్న' ఉన్నాడన్న బరితెగింపు వెరసి అనంతపురం జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి కారణమైంది. నిజాలు నిర్భయంగా రాస్తుంటే తట్టుకోలేక.. అధికారం చేజారిపోతోందన్న భయంతో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. ఆదివారం సాయంత్రం రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై తెగబడ్డాయి. ఈ ఘటనను రాజకీయ, ప్రజాసంఘాలు, జర్నలిస్టుల యూనియన్లు తీవ్రంగా ఖండించాయి.

అధికార మదం

- 'అనంత'లో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి
- సీఎం జగన్ 'సిద్ధం' అని ప్రసంగించగానే...
- రెచ్చిపోయిన వైసీపీ అల్లరి మూకలు
- ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడులు
- ఖండించిన రాజకీయ, ప్రజా సంఘాలు
- నేడు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు
- పిలుపునిచ్చిన ఏపీయూడబ్ల్యూజే



కర్నూలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ కవరేజీ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం అధికార మదానికి నిదర్శనమని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు అన్నారు. దాడిని ఖండిస్తూ జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, జి.కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, గౌరవ సలహాదారుడు కృష్ణారెడ్డి, అధ్యక్షుడు ఈఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసగౌడు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజి, ఫొటో అండ్ వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు స్నేహల్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు శివ, అవినాశ్, దస్తగిరి, వెంకటేశ్‌లు ఓ ప్రకటనలో ఖండించారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాల ఫొటోలు తీయడం.. వార్తలు సేకరించడం జర్నలిస్టులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. సీఎం జగన్ సభ ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణను వైసీపీ రౌడీలు చుట్టుముట్టి విచక్షణారహితంగా కొట్టారని అన్నారు. కాళ్లతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడం చూస్తే చంపాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారిపై రోజురోజుకూ దాడులు అధికమవుతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాచరిక పాలనలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సోమవారం మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో జర్నలిస్టులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అనంతపురం జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటలకు నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో ఏపీయూడబ్ల్యూజే ధర్నా, నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. అదేవిధంగా కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే నాయకులు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలో విధి నిర్వహణలో భాగంగా ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఖండించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. పత్రికా వ్యవస్థనే భయపెడితే.. సామాన్యులు మరింత భయపడుతారనే దురుద్దేశంతోనే జగన్ ఇలాంటి దాడులకు ఉసిగొల్పుతున్నాడు. హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని బీసీ జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

దాడి హేయమైన చర్య: సుబ్బారెడ్డి



డోన్, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడు సీఎం సభలో ఆదివారం ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ గూండాలు దాడి హేయమైన చర్య అని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. రాప్తాడులో జరిగిన సీఎం సభ కవరేజికి వెళ్లిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడికి పాల్పడటం బాధాకరమన్నారు. వైసీపీ సిద్ధమవుతున్నది జర్నలిస్టులపై దాడులు చేయడానికా అని ప్రశ్నించారు. వైసీపీ మూకలను వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్‌పై దాడి అమానుషం



నంద్యాల (ఆంధ్రజ్యోతి) ఫిబ్రవరి 18: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడి అమానుషమని ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు శ్యామ్‌సుందర్ లాల్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలం బాబు, కార్యదర్శి ఉస్మాన్ బాషాలు అన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభ కవరేజ్‌కి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటలకు నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో ధర్నా కార్యక్రమం ఉంటుందని, జర్నలిస్టులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

వైసీపీ దుర్మార్గానికి నిదర్శనం



అనంతపురం జిల్లాలో జరిగిన సిద్ధం సభలో కవరేజ్ చేసేందుకు వెళ్లిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి ఆపార్టీ దుర్మార్గానికి నిదర్శనం. సభలో సీఎం జగన్ రెచ్చకొట్టే ప్రసంగాలు చేయడం వల్లే వైసీపీ మూకలు రెచ్చిపోయి జర్నలిస్టులపై దాడికి తెగబడ్డాయి. ఇలాంటి దాడులను ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. జగన్ దుర్మార్గాలన్నింటిని ప్రజలు గమనిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయం.

- బుడ్డా రాజశేఖరరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే



విజయలో ఇష్టారాజ్యం..!

నంద్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీలోని అక్రమాల మీద ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. యాజమాన్యం ఇష్టారీతిన నడిపి సంస్థను అభాసుపాలు చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. కొత్తగా వందల మందిని ఉద్యోగాల్లోకి తీసుకుని వేల రూపాయల జీతాలు ఇస్తున్నారు. ఎప్పటి నుంచో పని చేస్తున్న వారికి పదోన్నతులు ఇచ్చినా జీతాలు పెంచకపోగా, తగ్గించారనే ప్రచారం ఉంది. ఇదిలా ఉంటే చైర్మన్, ఎండీ స్థాయి ఉద్యోగుల విలాసాల కోసం రూ. కోటికి పైగా వెచ్చించి ఖరీదైన కార్లు కొన్నారు. ఇదంతా ఓ ఎత్తైతే.. కోట్ల రూపాయలు పెట్టి కొన్న పాల పొడికి కాలం చెల్లిపోతున్నా పట్టించుకోడం లేదని అంటున్నారు. ఇదంతా పాలకవర్గం, డెయిరీ ఉన్నతస్థాయి ఉద్యోగుల నిర్లక్ష్యం వల్లే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త చైర్మన్ వచ్చినప్పటి నుంచి డెయిరీలో అక్రమాలు ఎక్కువయ్యాయనే విమర్శలున్నాయి. ఈ అక్రమాలన్నీ అధికార పార్టీ అండతోనే జరుగుతున్నందు వల్ల నిగ్గు తేల్చేవారు లేరని అంటున్నారు.

అక్రమాలను బయటపెడుతున్నారని..


- ఉద్యోగుల పట్ల తీవ్ర వివక్ష
- ప్రమోషన్లు పొందినవారి జీతాల్లో తగ్గింపు
- సొంత వారికి మాత్రం ఎక్కువ జీతాలు
- విలాసాలకు భారీగా ఖర్చులు

విజయ పాల డెయిరీ వివాదం ఈనాటిది కాదు. డెయిరీ పాలకవర్గం, ఉద్యోగవర్గం చేస్తున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో గతంలో కథనాలు వెలువడ్డాయి. అయినా సర్దుబాటు కాలేదు. కొత్త పాలకవర్గం వచ్చాక మరిన్ని అక్రమాలు పెరిగాయనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత పాలకవర్గం వచ్చాక దాదాపు 300 మందిని కొత్తగా డెయిరీలోనికి తీసుకున్నారు. వీరిలో దాదాపు 200 మందిని చైర్మన్‌కు తెలిసినవారేనే ఆరోపణలు ఉన్నాయి. మిగతావారు ఎమ్మెల్యేలు సిఫారసు చేసినవారు కాగా, అతి తక్కువ మందిని బయటి నుంచి తీసుకున్నట్లు సమాచారం. సాధారణంగా ఇందులో పనిచేసేవారికి జీతం రూ.15 వేలకు కాస్త అటుఇటుగా ఉంటుంది. ఎమ్మెల్యే చెప్పిన వారికి కూడా జీతాలు ఈ స్థాయిలోనే ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ చైర్మన్ తన సొంతవారికి మాత్రం రూ.25 వేల జీతం ఇస్తున్నట్లు సమాచారం. తన వారిపట్ల ఇంత ఉదారత చూపిన చైర్మన్ ఎప్పటి నుంచో డెయిరీలో పనిచేసే వారిపట్ల తీవ్ర వివక్ష చూపుతున్నారని డెయిరీలోని కార్మికులే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఎప్పటి నుంచో పనిచేస్తున్న తమకు రూ.15 వేలే ఇస్తున్నారని, కొత్తగా చేరిన వారికి రూ.25 వేలు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఏళ్లుగా పనిచేస్తూ పదోన్నతి పొందినవారిలో కొందరిని కర్నూలు, బనగానపల్లె, మైదుకూరు వంటి ప్రాంతాలకు బదిలీ చేశారు. విచిత్రం ఏమంటే అంతక ముందు రూ.25 వేలు జీతం తీసుకున్నవారికి పదోన్నతి పొందిన రూ.15 వేల నుంచి రూ.17 వేలకు కుదించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలో ఏ సంస్థ కూడా జీతాలు పెంచి పదోన్నతి ఇస్తుందని, కానీ పేస్కేలును తగ్గించి పదోన్నతి ఇచ్చిన ఘనత విజయ డెయిరీ నిర్వాహకులకే చెల్లనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



డెయిరీలోని ఓ 20 మంది కార్మికులు సభ్యులుగా ఏర్పడి యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వీరి మీద డెయిరీ పాలకవర్గం, ఉన్నత స్థాయి ఉద్యోగులు కక్షగట్టారు. వీరిని ఎలాగైనా వదిలించుకునేందుకు ఎదురు చూశారు. ఈ లోగా డెయిరీ డైరెక్టర్లు సొంత ఖర్చులకు సంస్థ సొమ్ములు వాడుకుంటున్నారని, టెండర్లు లేకుండా కోట్ల రూపాయలను తమకు ఇష్టమైనవారికి కట్టబెడుతున్నారని, బొగ్గును అమ్ముకున్నారన్న కథనాలు వెలువడ్డాయి. తమ అక్రమాలను యూనియన్‌గా ఏర్పడిన కార్మికులే బయటకు చెబుతున్నారనే అనుమానంతో వారిని యాజమాన్యం తొలగించింది. వీరిలో ఓ 9 మంది కార్మికులను భవిష్యత్తులో యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనబోమని బెదిరించి సంతకాలు చేయించుకుని విధుల్లోనికి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారిలో ఓ పదిమంది హైకోర్టును ఆశ్రయించారు. హన్మంతు అనే మరో వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించాడు. అతడ్ని విధుల్లోనికి తీసుకోవాలంటూ లోకాయుక్త చెప్పినా డెయిరీ పాలకులు స్పందించ లేదు. తాము అక్రమాలకు పాల్పడుతూ, అవి బయటపడితే కార్మికులను వేధించడం డెయిరీ పాలకవర్గం, పై స్థాయి ఉద్యోగవర్గం నియంతృత్వాన్ని తెలియజేస్తున్నదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఎందుకు ఇలా..?



డెయిరీ లాభాలను పాడిరైతులు, కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని డెయిరీ పాలకవర్గం చెబుతూ ఉంటుంది. అయితే ఇందులో వచ్చే డబ్బులను తమ సొంత విలాసాలకు ఖర్చు చేస్తూ డెయిరీ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డెయిరీ లాభాల్లో ఉండటం వాస్తవమే కానీ, ఆ లాభాలను పాడి రైతులు, కార్మికుల కోసం ఉపయోగించటమనేది అంతా హంబక్కేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవలే సంస్థ అవసరాల కోసం అంటూ ఒక్కో కారుని రూ.55 లక్షలు వెచ్చించి, రెండు కార్లను డెయిరీ చైర్మన్ ఆదేశాల మేరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. వీటిలో ఒకటి చైర్మన్, మరొకటి ఎండీ ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థకు భవిష్యత్తులో ఉపయోగపడతాయన్న ఉద్దేశంతో కార్లను కొనాలనుకుంటే రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల లోపు మంచి కార్లే వస్తాయి. కానీ సంస్థకు తాము తాత్కాలిక నిర్వాహకులం అన్న విషయం మరిచి, తామే యజమానులు అన్న రీతిలో ప్రవర్తించడం వారికే చెల్లిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ఇదే సమయంలో డెయిరీ అభివృద్ధికి కోసం పాటుపడిన కార్మికులు, ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే వారికి ఇప్పటికీ బెనిఫిట్లు అందించకపోవడం గమనార్హం. తమ విలాసాలకు ఇష్టానుసారంగా డబ్బు ఖర్చు చేస్తున్న నిర్వాహకులు కార్మికులు, ఉద్యోగుల బెనిఫిట్ల విషయం వచ్చే సరికి డబ్బులు లేవని బొంకుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమంపట్ల వాళ్ల నిబద్ధతకు నిదర్శనం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్లక్ష్యానికి పరాకాష్ట..

డెయిరీ పాలకవర్గం పాలు, పాల పదార్థాలు తయారు చేయడానికి మూడేళ్ల కిందట రూ.70 కోట్లు వెచ్చించి సుమారు 1500 టన్నులు పాలపొడిని గుజరాత్ కంపెనీ నుంచి కొన్నట్లు సమాచారం. ఆ తర్వాత అనంతపురం వంటి ప్రాంతాల నుంచి ఆవు పాల సేకరణ మొదలుపెట్టడంతో పాల పొడి వాడకం తగ్గింది. ఈ పాలపొడి గోడౌన్లలో మగ్గిపోతున్నా డెయిరీ పాలకవర్గం, ఉద్యోగవర్గం పట్టించుకోలేదు. దాదాపు 30 టన్నుల పైగానే పాలపొడికి కాలం చెల్లిపోయినా గుర్తించలేదు. ఇప్పటికే పలు విషయాల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న డెయిరీ నిర్వాహకులు, పాలపొడి కాలం చెల్లిపోవడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు. ఇక అంత ఎక్కువ మొత్తం పాలపొడిని బయటపడయటం కుదరదు కాబట్టి, కాలం చెల్లిన పాలపొడిని ఆ పొడిని ఇతర సంచుల్లోనికి మార్చారు. ఖాళీ సంచులను ఎవరి కంటా పడకుండా మాయం చేశారు. ప్రస్తుతం కాలం చెల్లిన పాలపొడితోనే పాలు, పాలపదార్థాలను తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా తయారు చేసిన పాలను మార్కెట్‌లోనికి పంపిస్తున్నట్లు అక్కడి కార్మికులు మాట్లాడుకోవడం గమనార్హం. ఈ పాలు ప్రమాదకరం అని తెలిసినా పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు ఉన్నాయి. సంస్థను లాభాల్లో నడిపించాల్సిన పాలకులు, ఉద్యోగులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డెయిరీ సొమ్మును భారీ స్థాయిలో వృథా చేయడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ముస్లింల ద్రోహి ఎమ్మెల్యే కాటసాని

- మాజీ ఎమ్మెల్యే బీసీ



కమ్యూనిటీ హాల్‌ను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 18: కోవెలకుంట్ల పట్టణంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి అది షాదీ ఖానా అని ముస్లింలను నమ్మించి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ద్రోహిగా మారారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బీసీ జనార్దన్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ విలేఖర్లతో మాట్లాడుతూ షాదీఖానా నిర్మిస్తా అంటూ ముస్లింల స్థలం తీసుకొని అక్కడ కమ్యూనిటీ హాల్ నిర్మించి ముస్లింలను ఎమ్మెల్యే దగా చేశారన్నారు. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని కోవెలకుంట్ల పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో షాదీఖానా పేరు చెప్పి కమ్యూనిటీ హాల్ నిర్మించారన్నారు. భూమి పూజ రోజున ముస్లిం మత పెద్దలను రప్పించి షాదీ ఖానా అని నమ్మించి మైనార్టీలను మోసగించారన్నారు. మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్నానని మైనార్టీల ఓట్ల కోసం ఎమ్మెల్యే రాజకీయం చేస్తున్నారని బీసీ ఆక్షేపించారు. ఈ కమ్యూనిటీహాల్‌లో వధూవరులు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులకు, బాత్‌రూంలకు పైకప్పు కూడా లేదన్నారు. వంటశాలలు, వంట సామగ్రి కూడా లేవని అన్నారు. ఇంకా 20శాతం పనులు పెండింగ్‌లో ఉన్నా ఎన్నికల కోడ్ వస్తుందనే కారణంలో ఆదరాబాదరగా పేరు కోసం కమ్యూనిటీ హాల్ ప్రారంభించి ముస్లిం మైనార్టీల మనోభావాలను ఎమ్మెల్యే దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ సౌకర్యం, కొళాయిలు కూడా లేవన్నారు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కోవెలకుంట్ల పట్టణం నడిబొడ్డులో పేద ముస్లింలకు అనువుగా ఉండేలా షాదీ ఖానా నిర్మించడానికి అన్ని అనుమతులు తీసుకువచ్చానని అన్నారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ఆగిపోయాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కాటసాని పట్టణ నడిబొడ్డున ఉన్న షాదీఖానా నిర్మాణం పూర్తిచేయకుండా ఊరిబయట 3 కిలోమీటర్ల దూరంలో షాదీఖానా నిర్మిస్తున్నానని కమ్యూనిటీ హాల్ నిర్మించి వారిని మోసంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు మతగురువు అన్సారీ, లాయర్ అల్లీహుసేని, అబ్దుల్లా, మహబూబ్‌బాషా, సాదిక్‌హుస్సేన్, లాయర్ శ్రీకాంత్, అహమ్మద్‌హుసేని, మహమ్మద్‌హుస్సేని, బికారి, సాయి, కుళ్ళాయి, టైలర్ భాష, మిస్కిన్, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి తదితులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త: ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 18 :సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారని, వాటిపట్ల సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. గూగుల్ నోటిఫికేషన్ ద్వారా వచ్చే క్యాష్ రివార్డులు, స్క్రాచ్ కార్డులను నమ్మవద్దని అన్నారు. ఆన్‌లైన్‌లో లోన్లు ఇస్తామనేవారికి దూరంగా ఉండాలన్నారు.

- **నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు :** జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అర్జీదారులు సమీపంలోని పోలీసు స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో స్పందన జరుగుతుందన్నారు.

SRISAILA DEVASTHANAM
శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానము, శ్రీశైలం - 518101, నంద్యాల జిల్లా.

షార్ట్ & సీల్డు టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.హెచ్1/5625/2023, తేది:17.02.2024

శ్రీశైల దేవస్థానం నందు జరుగు 2024 మహాశివరాత్రి బ్రహోత్సవముల సందర్భముగా తేది:01.03.2024 నుండి 11.03.2024 వరకు శ్రీశైలం అంతయూ పారిశుద్ధ్య పనులు నిర్వహించుటకుగాను చెత్త, చెదారములను సేకరించి డప్ యార్డుకు తరలించుటకు అవసరమైన 12 ట్రాక్టర్లను (డీజిల్, డ్రైవర్ బత్తా మరియు లేబరుతో కలిపి) ట్రిప్పు పద్ధతిపై సరఫరా చేయుటకు షార్ట్ & సీల్డు టెండర్లు పిలువడమైనది. అవసరమైన సమాచారము కొరకు ఫోన్: **9490542969, 9247187877, 9492693908** కార్యాలయ వేళలలో సంప్రదించగలరు.

శివ కార్యంలో.. సం/- డి.పెద్దిరాజు, డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి.

ఆర్టీసీ ప్రయాణికులకు నరకం

సర్వీసులన్నీ సిద్ధం సభకు మళ్లించడంతో అవస్థలు



కర్నూలు(రూరల్)ఫిబ్రవరి 18: కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం బస్సులు లేక ప్రయాణికులు నరకం చూశారు. దాదాపు 70 శాతానికి పైగా ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులన్నీ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం సభకు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయంగా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో దూర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ ఉన్నతాధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అరకొర బస్సులు వేళకు రాక ప్రయాణికులకు సరిపోక అష్టకష్టాలు పడ్డారు. కర్నూలు రీజయన్ వ్యాప్తంగా ప్రతిరోజూ 400 దాకా సర్వీసులు నడుస్తుండగా అందులో 220 పైగా బస్సులను ఆర్టీసీ అధికారులు జగన్‌రెడ్డి సభకు తరలించారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, గూడూరు, బెళగల్, ఆలూరు వంటి ప్రాంతాల ప్రజలు బస్సుల కోసం కొత్తబస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. ఉదయం నుంచే బస్సుల కొరత ఏర్పడింది. రెండు మూడు గంటలకు ఒక బస్సు రావడంతో అందులో సీట్ల కోసం ఎగబడే పరిస్థితి ఏర్పడింది. మరికొంత మంది ప్రైవేట్ ఉద్యోగులు సొంత ఊళ్లకు వచ్చి తిరుగు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడంతో అధిక చార్జీలు వసూలు చేశారు. జనం క్షేమాలను చూడాల్సిన ప్రభుత్వమే ప్రజలకు ఇంతటి ఇబ్బంది కలిగించడం దారుణమని పలువురు ప్రయాణికులు ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టారు.







ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 18: ఆటో బోల్తా పడి మృతి చెందిన ఘటన ఆదివారం జూపాడుబంగ్లా సమీపంలోని కేజీ రోడ్డుపై జరిగింది. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన బాలవెంకటరమణగౌడు (54) ఆత్మకూరులో బంధువుల పెళ్లి ఉందని జూపాడుబంగ్లాకు వచ్చి అక్కడ ఆటో వెళుతుండగా జూపాడుబంగ్లా- 80 బన్నూరు గ్రామాల మధ్య మలుపులో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న బాలవెంకటరమణ గౌడుకు తీవ్ర గాయాలు, ఆటోడ్రైవర్ హమీద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, భార్య ఉన్నట్లు చెప్పారు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18: ఓర్వకల్లు గ్రామానికి చెందిన కంబలి నాగేశ్వరయ్య (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. కంబలి నాగేశ్వరయ్య భార్య ఇటీవలె మృతి చెందింది. దీనికితోడు ఆయనకు వ్యవసాయంలో అప్పులయ్యాయి. వీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుని కుమార్తె భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు ఐఐఐటీడీఎం జాతికి అంకితం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 18: కర్నూలు జగన్నాథగట్టుపై ఏర్పాటు చేసిన ఐఐఐటీడీఎంను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం 151.51 ఎకరాల్లో రూ.296.12 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో నిర్మించారు. ఈ క్యాంపస్‌లో 16 తరగతి గదులు, 22 ప్రయోగశాలలు, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్, 3 సెమినార్ హాళ్లు, 4 హాస్టళ్లు, 2 మెస్ బ్లాకులు, డైరెక్టర్ బంగ్లా, 20 ఫ్యాకల్టీ క్వార్టర్లు నిర్మించారు. అలాగే 2 సబ్‌స్టేషన్లు, హెల్త్ అండ్‌వెల్‌నెస్ సెంటర్లతో పాటు 1260 మంది విద్యార్థులకు వసతి కల్పించేందుకు అభివృద్ధి చేశారు. ఈ క్యాంపస్‌లో మొత్తం 907 మంది విద్యార్థులు 4 అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, 6 పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, పీహెచ్‌డీ ప్రోగ్రాంలలో విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం 40 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ, 10 మంది అనుబంధ ఫ్యాకల్టీ, ప్రొఫెసర్ ప్రాక్టీస్ 19మంది రెగ్యులర్ నాన్ టీచింగ్ సిబ్బందితోపాటు ఔట్‌సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. రూ.843.56 లక్షల విలువైన పరిశోధన ప్రాజెక్టులను అమలు చేస్తున్నారు. దీంతోపాటు 14 పేటెంట్లు ఇన్‌స్టిట్యూట్‌కు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, చైర్మన్ హెచ్‌ఏ ప్రొ.రంగనాథ్, డైరెక్టర్ ప్రొ.డీవీఎల్‌ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ గురుమూర్తిలతో పాటు ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొననున్నారు

21న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 18: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్ అండ్ మండల ప్రజాపరిషత్‌ల వార్షిక బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

1600 లీటర్ల ఊట, 35 లీటర్ల సారా ధ్వంసం



నాటు సారా స్థావరాలను ధ్వంసం చేస్తున్న సెబ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 18: నగరంలోని బంగారుపేటలో ఉన్న నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఆదివారం అడిషనల్ ఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐలు కేఆర్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నాటు సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల ఊట, 35 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. మరో ప్రదేశంలో నాటు సారా విక్రయిస్తున్న షికారి మధు నుంచి 30 లీటర్ల నాటు సారా, షికారి లక్ష్మి నుంచి 25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి బాధ్యులను రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జీ. మారుతీ ప్రసాద్, డీటీఎఫ్ ఎస్ఐ వీరస్వామి, ఇంటలిజెన్స్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

భావితరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించాలి

కలెక్టర్ డాక్టర్ జి. సృజన



ధార్మిక సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: ఆధ్యాత్మిక సంపదను భావి తరాలకు అందించాలని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. ఆదివారం రాత్రి నగరంలో రాఘవేంద్రనగర్‌లోని షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరంలో, కర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పిరమిడ్ బ్రహ్మరుషి డాక్టర్ బీవీ రెడ్డి ఏర్పాటు చేసిన బాబా విగ్రహమూర్తికి వెండి మకర తోరణం, వెండి సింహాసనం అలంకరణ ఉత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాబా విగ్రహానికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ధ్యాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పిరమిడ్ ధ్యాన కేంద్రాలు ఆధ్యాత్మిక స్ఫూర్తికి జీవం పోస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి, విశ్రాంత ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మాలకొండయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తదితరులు ప్రసంగించారు.

రైతులు సహకరించాలి

రుణ బకాయిలు చెల్లించి సహకార బ్యాంకుకు తోడ్పడండి

● కేడీసీసీ బ్యాంకు సీఈవో శివలీల

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 18: ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న రైతులు వెంటనే నిర్దేశించిన సమయంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని ఆ బ్యాంకు సీఈవో శివలీల విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రుణాల రికవరీకి లక్ష్యం మేరకు రికవరీ చేసేందుకు అధికారుల బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పాత బకాయిలు దాదాపు రూ.200 కోట్లు ఉండగా.. రూ.20 కోట్లు రెన్యువల్ అయ్యాయని, మిగిలిన రూ.180 కోట్లను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని రుణాలు కలిపి రూ.756 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. దీనికి రైతులు సహకరించాలని కోరారు. ఈ మేరకు బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తారని అన్నారు. గడువులోగా రుణాలు చెల్లిస్తే.. అధికవడ్డీతో పాటు అపరాధ వడ్డీ భారం ఉండదని అన్నారు.

శాస్త్రబద్ధంగా మహా కుంభాభిషేకం



మహాకుంభిషేకం క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, ఫిబ్రవరి 18: శ్రీశైలం క్షేత్రంలో మహాకుంభాభిషేకం వేడుకలను దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన మహా కుంభాభిషేకం మహోత్సవ క్రతువులు మూడో రోజు కొనసాగాయి. ఉదయం సకలదోషాలను హరింపజేసే గోపూజ, మండప పూజలు, జపాలు, వేదపారాయణలు, గణపతి, రుద్ర, చండీ పారాయణలు, హోమాలు, వేదహవనాలు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం ధాన్యాధివాసం, దేవతా హవనాలు, వేదహవనాలు, వేదస్వస్తి, నీరాజన మంత్ర పుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 16న ప్రారంభమైన మహా కుంభాభిషేకం మహోత్సవం 21వ తేదీతో ముగియనుంది. ఆరు రోజులపాటు జరిగే మహోత్సవంలో చివరి రోజు 21వ తేదీన ఆల యంలో పునర్నిర్మించిన శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన కొన్ని ఉప ఆలయాలు, పంచ మఠాలలోని మూడు మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేయనున్నారు. ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో విధివిధానంగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి, జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపిస్తున్నారు. చివరగా మంత్ర పూజిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలు, గోపురాలు, దేవతామూర్తులను అభిషేకిస్తారు. శ్రీశైలంలో నిర్వహించే ఈ మహిమాన్విత కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

పార్టీ పరిధిలోనే పని చేయాలి

- క్రమ శిక్షణ చర్యలు తప్పవు
- మాచాని సోమనాథ్‌ను సంజాయిషీ కోరాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 18: ప్రతి ఒక్కరూ పార్టీ పరిధిలోనే పని చేయాలని.. లేదంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బీటీ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోని వారిని రెచ్చగొట్టి గ్రూపులుగా విడదీసి లబ్ధి పొంది తిరిగి అధికారంలోకి రావటానికి కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఇటీవల ఎమ్మిగనూరులో డా. మాచాని సోమనాథ్ నియోజకవర్గంలో పర్యటిస్తుండగా ఫ్లెక్సీలలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డి ఫొటోలను ముద్రించకపోవడం రాష్ట్ర, జిల్లా పార్టీ దృష్టికి వచ్చిందని అన్నారు. సోమనాథ్ ఈ విధంగా చేయడం పార్టీ క్రమశిక్షణా రాహిత్యం కిందకు వస్తుందని అన్నారు. ఈ విషయంపై మాచాని సోమనాథ్‌ను సంజాయిషీ కోరామని తెలిపారు.

వైభవంగా సూర్యనారాయణ స్వామి కళ్యాణం



వైభవంగా ఛాయా, ఉషాదేవి సమేత సూర్యనారాయణస్వామి కళ్యాణోత్సవం

కల్లూరు, ఫిబ్రవరి 18: ఛాయా, ఉష సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గుత్తిపెట్రోల్ బంక్ సమీపంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో గణపతి సచిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఆలయ ధర్మకర్తల మండలి, ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం ఘనంగా జరిపారు. ప్రధాన సేవకులు జి, విజయభాస్కరరెడ్డి కళావతి, వై.రామ్మోహన్ అనంతలక్ష్మి, సి.కృష్ణారెడ్డి మంజుల దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 64 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 18: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ఆదివారం 64 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 3353 మందికి గాను 3289 మంది హాజరయ్యారని, ఉదయం సెషన్స్‌లో 1757 మందికి గాను 1723 మంది హాజరయ్యారని అన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 1596 మందికి గాను 1566 మంది హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు తెలిపారు.

వైసీపీ నాయకుడి దౌర్జన్యం

- పక్క పొలం ఆక్రమణ
- రాత్రికి రాత్రే రహదారి



బాధిత రైతు పురుషోత్తం రెడ్డి పొలంలో రహదారి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 18: నంద్యాల మండలంలోని రాయమల్పురం గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ కుమారుడు పూల శ్రీను దౌర్జన్యానికి దిగాడు. టీడీపీ నేత పొలాన్ని ఆక్రమించి రాత్రికి రాత్రే రహదారి వేయించుకున్నాడు.. రాయమల్పురం గ్రామ పరిధిలోని సర్వే నెం. 30లో వైసీపీ నాయకుడు పూల శ్రీనుకు 1.30 ఎకరాల పొలం ఉంది. పొలం పరిసరాల్లోనే పక్క గ్రామమైన పులిమద్దికి చెందిన పురుషోత్తం రెడ్డికి సర్వే నెం. 27/1లో 43 సెంట్లు 27/2లో 23 సెంట్ల పొలం ఉంది. వైసీపీ నాయకుడి పొలానికి రహదారి లేకపోవటంతో పురుషోత్తం రెడ్డి పొలాన్ని ఆక్రమించాడు. రాత్రికి రాత్రే పురుషోత్తం రెడ్డి చెందిన సర్వే నెంబర్ 27/1 పొలంలో మట్టి రాళ్లు తోలి రహదారి వేశాడు. విషయం తెలుసుకున్న పురుషోత్తం రెడ్డి పూల శ్రీను అధికారానికి జడిసి రెవెన్యూ సిబ్బందిని ఆశ్రయించాడు. సబంధింత వీఆర్వో అశోక్ ఘటనా స్థలికి చేరుకుని పూలశ్రీను దౌర్జన్యంగా రస్తా వేసుకున్న విషయాన్ని నిర్ధారించుకున్నారు. విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పి వెళ్లాడు. దీంతో తనకు న్యాయం చేయాలని పురుషోత్తం రెడ్డి వేడుకుంటున్నాడు.

మహా కుంభాభిషేకం ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

శ్రీశైలం, ఫిబ్రవరి 18: శ్రీశైలం క్షేత్రంలో నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకం, శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన జరిగే మహాకుంభాభిషేక మహోత్సవంలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే కైంకర్యాలు, వైదిక కార్యక్రమాలు సమయపాలనతో పరిపూర్ణంగా జరిపించాలన్నారు. కుంభాభిషేకం మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సంప్రదాయ బద్ధంగా అలంకరించాలని సూచించారు. అన్ని విభాగాల అధిపతులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా కుంభాభిషేక మహోత్సవాన్ని జరిపించాలన్నారు. ఆలయ వేళలు మొదలైన సమాచారాన్ని ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా భక్తులకు తెలియజేయాలన్నారు. అలాగే శ్రీశైల టీవీ ద్వారా మహాకుంభాభిషేక మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలని చెప్పారు. అనంతరం మార్చి 1 నుంచి 11 వరకు జరగబోయే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శివదీక్షా భక్తుల జ్యోతిర్ముడి సమర్పణ ఏర్పాట్లు, ఆరుబయట ప్రదేశాలలో విద్యుద్దీకరణ, తాత్కాలిక శౌచాలయాలు, క్షేత్ర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, సూచికబోర్డు ఏర్పాటు, పాతాళగంగలో జల్లు స్నానాల ఏర్పాట్లు, నీటి సరఫరా, పారిశుధ్యం తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు, స్వామివారి ప్రధానార్చకులు శివప్రసాద్, అమ్మవారి ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణ శర్మ, అధ్యాపక పూర్ణానందరం, స్థానిక తహసీల్దార్ సి.గురప్ప, సీఐ ప్రసాదరావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రక్త స్రావంతో మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 18: కర్నూలు కొత్త బస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి శస్త్రచికిత్స కోసం వచ్చిన ఓ మహిళకు తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించి హైదరాబాదుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. దీనికి కర్నూలులోని ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆదివారం ఆందోళనకు దిగారు. నందికొట్కూరుకు చెందిన షేక్ ఆసియా (36)ను గర్భసంచి ఆపరేషన్ కోసం ఈ నెల 14వ తేదీ నగరంలోని కొత్తబస్టాండు వద్దనున్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. 15వ తేదీ వైద్యులు ఆపరేషన్ కోసం రోగిని థియేటర్‌లోనికి తీసుకెళ్లారు. ఉన్నట్టుండి రోగి ఆరోగ్య పరిస్థితి విషమించింది. మత్తుమందు ఇవ్వడంలో పొరపాటు, వైద్యుల అనుభవరాహిత్యం కలిసి రోగికి తీవ్ర రక్తస్రావం జరిగింది. రోగిని ఐసీయూలో ఉంచి రాత్రంతా చికిత్స అందించారు. అయినా పరిస్థితి విషమంగా మారడంతో 16వ తేదీ నగరంలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ కూడా వైద్యులు చేతులెత్తేయడంతో హైదరాబాదుకు తరలించారు. అక్కడ ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 17వ తేదీ రోగి మృతి చెందింది. దీనికి కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు హాస్పిటల్ యాజమాన్యంతో వాగ్వివాదం చేశారు. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేసి వివాదాన్ని సర్దుబాటు చేశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18: కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన బోయ నారాయణ (71) ఈ నెల 11వ తేదీ ఆత్మహత్యాయత్నం చేసి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. క్షయ వ్యాధితో బాధపడుతున్న నారాయణకు భార్యా పిల్లలు లేరు. జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోడానికి విష ద్రావణం తాగాడు. బంధువులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని సీఐ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న యువత

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 18: యువత వినూత్నంగా ఆలోచించినప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం రాత్రి నగర శివారులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో 'లెవ్ యుగ్' అనే నూతన సంస్థకు సంబంధించిన లోగోను, వెబ్‌సైట్‌ను లక్ష్మీనారాయణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన యువకుడు, ప్రస్తుతం కేరళలోని కాలికట్ ఎన్ఐటీలో తృతీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న జీవి కైలాస్‌నాథ్ ఈ సంస్థను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. 19 ఏళ్ల ప్రాయంలోనే ఒక కంపెనీని ప్రారంభించిన కైలాస్‌నాథ్ యువతకు ఆదర్శమని ప్రశంసించారు. కైలాస్‌నాథ్ మాట్లాడుతూ యువత ఏదైనా కంపెనీ ప్రారంభించాలనుకుంటే మౌలిక సదుపాయాలు సమకూర్చడం తమ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, ప్రముఖ రక్తదాత ఎల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



WANTED

Wanted Lady Tele Callers & (M/F) Vice Principals & (M/F) Team Leaders. Salary : 15,000/- to 25,000/- Gayathri Estates, KNL. 98480 00404.

AJL- 180100

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర। 7382114647

AJA- 176960

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



'కాంట్రాక్ట్ కార్మికులపై నిర్లక్ష్యం తగదు'



ఆర్ఏఆర్ఎస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని కాంట్రాక్టు కార్మికుల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి తగదని ఆర్ఏఆర్ఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు పుల్లయ్య అన్నారు. ఆదివారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో రోజు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆర్ఏఆర్ఎస్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో పొలాల్లో పని చేసే కాంట్రాక్టు కార్మికులకు ఏ ప్రమాదం జరిగినా అధికారులే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ ప్రభుత్వం వెంటనే ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రమాదవ శాత్తు చనిపోతే రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆఫీసుల్లో పని చేసే అటెండర్, స్వీపర్ పోస్టులను కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినాలు ఇచ్చిన విధంగానే కాంట్రాక్టు కార్మికులకు కూడా వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఏఆర్ఎస్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరమ్మ, అయ్యన్న, రమణమ్మ, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి: ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 18: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ అధికారం కోసం లేనిపోని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రదు ్దచేస్తానని చెప్పి ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఆ ఊసెత్తకపోవడం దౌర్భాగ్యమన్నారు. సీపీఎస్ రద్దు చేయకుండా జీపీఎస్‌ను తెరమీదకు తీసుకురావడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కల్పిస్తున్న వైసీపీ పాలనను పారదోలుతామని హెచ్చరించారు. మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పి ఇప్పుడు చేస్తున్నదేంటని ప్రశ్నించారు. ఏపీజీఎల్ఐ రుణాలను మెచ్యూరిటీ మొత్తాలను, సరెండర్ లీవ్‌ల మొత్తాలను ప్రభుత్వం ఉద్యోగుల ఖాతాల్లో జమచేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు దస్తగిరిబాషా, తిమ్మారెడ్డి, రంగనాయకులు, సుబ్బారెడ్డి, పుల్లయ్య రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎరుకల కాలనీలను అభివృద్ధి చేయాలి'


స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలోని ఎరుకల కాలనీలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఎరుకల సమాఖ్య చైర్మన్ వై.రామలింగడు కోరారు. నంద్యాల పట్టణంలోని నివర్తినగర్‌లో ఆదివారం స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ సభ్యులు నివర్తి నగర్‌లో కాలువలు, రహదారులు శుభ్రం చేశారు. అనంతరం సంస్థ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎరుకలి కాలనీలు దయనీయ స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సంస్థ ఎరుకలి కాలనీలలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు నాగార్జున, సభ్యులు కె.చంద్రశేఖర్, ఎన్.లింగమయ్య, ఎన్.రాజు, కె.రామాంజనేయులు, నారాయణ, రాజనాల, సాలన్న తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గిరిజన గూడేలకు విద్యుత్ వెలుగులు

- రూ.78 లక్షలతో ప్రతిపాదనలు
- ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్ కుమార్ వెల్లడి

కొత్తపల్లి, ఫిబ్రవరి 18: గత 40 సంవత్సరాలుగా చిమ్మచీకటిలో కాలం వెళ్లదీస్తున్న ఆ గిరిజన గూడెలకు త్వరలోనే విద్యుత్ వెలుగులు రానున్నాయి. ఈ మేరకు ఆత్మకూరు విద్యుత్ అధికారులు గూడేలను సందర్శించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆత్మకూరు విద్యుత్ ఏడీ రమేష్‌కుమార్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఐటీడీఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంగమేశ్వరం నుంచి సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు రహదారి వెంట సుమారు 8 కి.మీల మేర సర్వే చేసినట్లు తెలిపారు. ఈ 8 కి.మీ.ల పరిధిలో 194 విద్యుత్ స్థంభాలతో పాటు, మూడు ట్రాన్స్‌ఫారామ్‌లు కూడా ఏర్పాటు చేయాల్సి వస్తుందని చెప్పారు. వీటికి సుమారు రూ.78 లక్షల మేర ఐటీడీఏ అధికారులు నిధులు కేటాయిస్తే.. త్వరలోనే తమ శాఖ పరిధిలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రధానంగా రహదారి వెంట విద్యుత్ స్థంభాలు ఏర్పాటుకు అటవి శాఖ అనుమతులు కావాల్సి వస్తుందని వివరించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



భక్తులకు ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

శ్రీశైలం, ఫిబ్రవరి 18: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఎం. రాజరామ్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. లక్ష విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఫణీధర్‌ప్రసాద్‌కు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు.

యువతను మోసగించిన సీఎం: టీడీపీ


మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు ఫిబ్రవరి 18: యువతకు గంజాయి, మద్యం, మత్తులకు బానిసలుగా చేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని, యువతను ఆయన మోసగించారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ఆరోపించారు. ఓటు హక్కు పొంది మొదటి సారి తమ ఓటు హక్కును 2024లో తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకుంటున్న యువత తమ ఫస్ట్ ఓటును సీబీఎన్‌కే వేసి తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టీడీపీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా ఆదివారం 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే కార్యక్రమాన్ని నందికొట్కూరు పట్టణంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. నందికొట్కూరు పటేల్ సెంటర్ నుంచి పట్టణంలోని సత్యనారాయణ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ముందుగా ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కేక్‌ను మాండ్ర శివానందరెడ్డి, గౌరు వెంకటరెడ్డి, జగన్‌విఖ్యాత్‌రెడ్డి కట్ చేసి నూతనంగా ఓటరుగా నమోదైన యువకులకు కేక్ తినిపించారు. మాండ్ర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నమ్మించి యువతను, రైతుల కష్టాలను తొలగిస్తానని చెప్పి రైతులను, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తానని మహిళలను నమ్మించి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వీరందరిని నట్టేట ముంచారన్నారు. కేవలం వలంటీర్లు, మద్యం షాపుల్లో సేల్స్ మెన్ పోస్టులు ఇస్తూ వారి భవిష్యత్తుతో జగన్ ఆడుకుంటున్నారన్నారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవకాశాలు లేక గంజాయాయి, మత్తు, మద్యానికి బానిసలను చేస్తున్నారన్నారు. నలికీ మద్యంతో యువత ఆరోగ్యాన్ని కూడా నాశనం చేస్తున్నారన్నారు. కావున యువత మేల్కొని భవిష్యత్తును నిర్దేశించే టీడీపీకి ఓటు వేసి నారా చంద్రబాబునాను సీఎంగా చేయాలని ఆయన సూచించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎం, ఎమ్మెల్యేలు వ్యాపారం చేస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. జగత్ విఖ్యాత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌ను ఇంటికి పంపేందుకు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి షకీల్ అహ్మద్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముర్తుజావలి, జాకీర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

- వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. నందికొట్కూరు మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, నాగటూరు టీడీపీ నాయకుడుమల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైసీపీ 2, 5వ వార్డు సభ్యులు పుల్లారెడ్డి, వంశీ మోహన్‌రెడ్డి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సిద్ధం సభతో తప్పని ఇబ్బందులు

- ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికుల పడిగాపులు


ఆత్మకూరు బస్టాండులో ప్రయాణికులు



బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న జనం

ఆత్మకూరు, ఫిబ్రవరి 18: వైసీపీ తమ పార్టీ ప్రచారం కోసం ఆదివారం అనంతపురం జిల్లాలోని రాప్తాడులో తలపెట్టిన సిద్ధం సభతో ఆత్మకూరు ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పలేదు. సిద్ధం సభకు రాయలసీమ జిల్లాల నుంచి జనాన్ని తరలించేందుకు ఆ పార్టీ చేయని ప్రయత్నమే లేదు. ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ పరిధిలోని స్కూల్ బస్సులను తెప్పించుకుని సభకు జనాన్ని తరలిం చారు. అంతేకాకుండా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అత్యధిక సంఖ్యలో సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను మళ్లించడంతో ప్రయాణికులు బస్సుల కోసం నానా అవస్థలు పడ్డారు. ప్రతిరోజు కర్నూలు, నంద్యాల ప్రాంతాలకు 25 వరకు బస్సులు రాకపోకలు సాగించేవి. అయితే సిద్ధం సభకు బస్సులు తీసుకెళ్లడంతో ఆయా ప్రాంతాలకు కనీసం నాలుగైదు బస్సులు కూడా తిరకపోవడంతో ప్రయాణికులు పడిగాపులు గాయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో శ్రీశైలం నుంచి కర్నూలు మీదుగా వెళ్లే కర్ణాటక బస్సుల్లో సీట్ల కోసం ఇక్కడి ప్రజలు పడిన ఇబ్బందులు అన్నిఇన్ని కావు. కేవలం వైసీపీ తమ ఆర్భాట ప్రచారం కోసం జనాన్ని ఇబ్బందులకు గురిచేసిందని ప్రజలు మండిపడుతున్నారు. ఆర్టీసీ సంస్థ కూడా ప్రయాణికుల ఇబ్బందులను పరిగణలోని తీసుకోకుండా బస్సులను మళ్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులను ఇతర అవసరాలకు వాడకూడదు. అయితే స్కూల్ బస్సులను వైసీపీ సభకు సిద్ధం చేయడంపై జనం ఆశ్చర్యానికి గురవుతున్నారు.

లోన్ పేరిట బురిడీ

- తక్కువ వడ్డీకి రుణాలంటూ వల
- ఒక్కొక్కరి వద్ద రూ.5 వేలు వసూలు చేసి ఉడాయింపు


కేటుగాళ్లు ఇచ్చిన వస్తువులను చూపుతున్న బాధితులు



కేటుగాళ్లు ఇచ్చిన గ్రైండర్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 18: నంద్యాల జిల్లా కేంద్రంలో నయా మోసం వెలుగు చూసింది. లోన్ పేరిట పేద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసి దుండగులు ఉడాయించారు. దీంతో బాధితులు మోసపోయామంటూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు, విజయవాడలో ప్రైవేట్ సంస్థ ఉందంటూ అందులో ఖాతాదారులుగా చేరితే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తారని కొంతమంది కేటుగాళ్లు పేదలను నమ్మించారు. దీంతో రూ.5 వేలు డిపాజిట్ చేశారు. డిపాజిట్ చేసిన కొంత మందికి గిఫ్టులు మంజూరయ్యాయని గ్రైండర్లు, ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్లను పంపిణీ చేశారు. దీంతో మరికొంత మంది ఆశపడి సంస్థలో చేరారు. ఒక్కొక్కరి నుంచి రూ.5వేల చొప్పున వసూలు చేసి రుణాలు త్వరలోనే వస్తాయంటూ నమ్మబలికారు. డబ్బు కట్టి చాలా రోజులు గడుస్తున్నా రుణాలు రాకపోవడంతో నంద్యాల జిల్లా కేంద్రంలోని కేటుగాళ్లకు ఖాతారులకు ఫోన్ చేశారు. అదిగో.. ఇదిగో అంటూ ఖాతాదారులను మభ్యపెట్టారు. చివరకు కేటుగాళ్ల సెల్‌ఫోన్లు స్విచ్చాఫ్ కావడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు చేసేదిలేక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించారు. దాదాపు 20 మంది మహిళలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైస్తవులను మోసం చేసేందుకు జగన్ సిద్ధం

- టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు



మాట్లాడుతున్న ఈటె స్వామిదాసు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 18: రాష్ట్రంలో క్రైస్తవులను మరోసారి మోసం చేసేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారని, క్రైస్తవులు అప్రమత్తం కావాలని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ పిలుపునిచ్చారు. ఆదివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 75 వేలమంది పాస్టర్లు ఉంటే 10శాతం మందికి మాత్రమే గౌరవ వేతనాలిస్తున్నారని, మిగిలిన వారికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో చర్చిలు, శ్మశాన వాటికలు, క్రైస్తవుల కాలనీలు ఎన్ని కట్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. చర్చిల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి ఎన్నికల్లో క్రైస్తవుల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులను జగన్ పూర్తిగా విస్మరించి మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో మోసపు మాటలను వల్లెవేస్తున్నారని అన్నారు. క్రైస్తవులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకుండా వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా, ఆస్తులను దోచుకుంటున్నా ప్రభుత్వ పెద్దలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 277 చర్చిలను కట్టించామని, వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఒక్క చర్చినైనా కట్టించిన పాపాన పోలేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అంతర్జాతీయ ప్రసంగీకురాలు వైఎస్ విమలారెడ్డితో పాస్టర్లు, దైవ సేవకుల సదస్సులు జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తూ తాయిలాలు ప్రకటించడం దేనికి సంకేతమని ధ్వజమెత్తారు. క్రైస్తవులు, ఇతర వర్గాల ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితిలో లేరని, ఆయన పాలనతో విసుగుచెందారని రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. క్రిస్టియన్ నాయకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీలో ఉర్దూ అభ్యర్థులకు అన్యాయం'


మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉర్దూ విభాగం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పస్పీల్ మున్నా అన్నారు. ఆదివారం ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుమారు 120 ఉర్దూ ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉంటే డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఒక పోస్టుకు కూడా నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ముస్లిం యువతకు ఇంత అన్యాయం జరిగినా రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలో నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. అంతేకాకుండా వేల సంఖ్యలో ఉర్దూ విభాగం అభ్యర్థులు డీఎస్సీకి సిద్ధమైతే రాష్ట్రవ్యాప్తంగా కేవలం ఆరు పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు 23వేల టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని గగ్గోలు పెట్టిన సీఎం జగన్ అధికారంలోకి రాగానే కేవలం 6100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను నిండా ముంచారని విమర్శించారు. ఉర్దూ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా మరిన్ని ఉర్దూ విభాగం పోస్టులను పెంచి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీకాంత్‌గౌడ్, ఫణీంద్రయాదవ్, సురేష్, అశోక్ ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 18: కలెక్టరేట్‌లో వైఎస్సార్ సెంటినరీ హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకంతా జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యధాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

- రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు ప్రచారం
- జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల ఇన్‌చార్జి ఫరూక్


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 18: టీడీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో మల్లెల రాజశేఖర్, ఎన్ఎండీ ఫరూక్ మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కోలేక ఓ పత్రికలో తప్పుడు వార్తలు రాయించారని మండిపడ్డారు. నంద్యాల టీడీపీ టికెట్ ఫరూక్‌కు అధిష్టానం ఇదివరకే కేటాయించిందని, వైసీపీ నంద్యాల టికెట్ ఇప్పటివరకు మీకు ఇంకా కేటాయించలేదని అన్నారు. మీ హయాంలో ఏ అభివృద్ధి చేశారని శిల్పా కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శించారు. ఓటమి భయంతో టీడీపీపై అభాండాలు వేసి పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మాజీ కౌన్సిలర్లు మిద్దె హుసేని, దూదేకుల దస్తగిరి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


వీరభద్రస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 18: నంద్యాల బైరమల్ వీధిలో వెలసిన భద్రకాళి సహిత వీరభద్రస్వామి దేవాలయం 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాంబశివయ్య స్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీరభద్ర స్వామి భక్త బృందం, వీరశైవులు పాల్గొన్నారు.

ఘనంగా తిక్కస్వామి ఉరుసు


మొక్కుబడులు సమర్పించుకుంటున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 18: నంద్యాల సాయిబాబా నగర్‌లో వెలసిన హజరత్ సయ్యద్‌షా షెహెన్‌షా (తిక్కస్వామి) దర్గా ఉరుసు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్గాను దర్శించి, పూలమాలలు, చాదర్ కొబ్బరికాయ కర్పూరం, అగర బత్తీలు వెలిగించి చక్కెర, బెల్లం, నగదు రూపంలో దర్గావద్ద మొక్కుబడులను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమ, మంగళ వారాలలో తిక్కస్వామి జాత్రలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు షేక్ అల్లాబకాష్ తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. గాజులు దుకాణాలు, తినుబండారాల దుకాణాలు, చిన్నారుల బొమ్మల దుకాణాలు, వెలిశాయి.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 18: మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రాజేష్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. నందికొట్కూరు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.22,600 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జువ్వాజీ రాజశేఖర్‌గౌడు, పక్కీర్ సాహెబ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో అనంతపురం జిల్లా న్యాయాధికారి పూజలు


న్యాయాధికారిని సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, ఫిబ్రవరి 18: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అనంతపురం జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం న్యాయాధికారికి ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం వేదపండితుల సమక్షంలో సుబ్రహ్మణ్యేశ్వర, నాగలింగేశ్వర స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయాధికారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణస్వామి , సురేష్ శర్మ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

'ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం'

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 18: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషమని ఆళ్లగడ్డ తాలుకా జర్నలిస్టులు ఆదివారం డిమాండు చేశారు. జర్నలిస్టులకు భద్రత కల్పించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు మండల సమావేశం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18: కొలిమిగుండ్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాయిక్రిష్ణ ఆదివారం తెలిపారు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీలు వార్డు మెంబర్లు ఆయాశాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

జీవో 106ను రద్దు చేయాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 18: జీవో నంబరు105ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య, సుధాకర్, సుబ్బయ్య పేర్కొన్నారు. కోవెలకుంట్లలోని పాండురంగస్వామి ఆలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రాన్స్‌పోర్టు కార్మికులకు నష్టం కలిగిస్తున్న 106 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దస్తగిరి, నాగేశ్, మధు, హాజీబాషా, ప్రసాద్, బాలుడు పాల్గొన్నారు.

డోన్‌లో స్విమ్మింగ్ ఫూల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్(రూరల్), ఫిబ్రవరి 18: పట్టణంలోని నెహ్రూనగర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన స్విమ్మింగ్ ఫూల్‌లో పిల్లలకు స్విమ్మింగ్ ఫూల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిద పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అందజేశారు. పట్టణంలోని శ్రీసుధా స్కూల్ విద్యార్థి భరత్ ప్రథమ బహుమతి, జగన్ రెండో బహుమతి, శ్రీ అక్షర స్కూల్‌కు చెందిన విజయ్ మూడో బహుమతిని సాదించారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను మున్సిపల్ చైర్మన్ రాజేష్ అభినందించారు. శ్రీ అక్షర స్కూల్ విద్యార్థి తృతీయ బహుమతి అందుకోవడంతో ఆ పాఠశాల డైరెక్టర్ రఘురాం కరస్పాండెంట్ రామకృష్ణ అభినందించారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'



మాట్లాడుతున్న సీమాంధ్ర బీసీ సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా

చాగలమర్రి, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమవుతుందని సీమాంధ్ర బీసీ సంక్షేమ మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. ఆదివారం బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అహోబిల లక్ష్మీనరసింహస్వామికి వెళ్లే రహదారిలో భక్తుల నుంచి అధికంగా టోల్‌గేట్ వసూలు చేయడం దారుణమన్నారు. దైవదర్శనానికి వెళ్తుంటే డబ్బులు వసూలు చేస్తుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు, పీఠాధిపతులు టోల్‌గేట్ వసూలు అధికంగా లేకుండా చూడాలని కోరారు. భక్తుల సౌకర్యాలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బాల దస్తగిరి, రాజేష్, బ్రహ్మయ్య, నాగరాజు, సుబ్బరాయుడు, అలి, బాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీసులు

చాగలమర్రి, ఫిబ్రవరి 18: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ రమణయ్య, ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం, నగదు, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. బిల్లులు లేకుండా విలువైన వస్తువులను తరలించరాదని అన్నారు. చెక్‌పోస్టు వద్ద రాత్రింబవళ్లు వాహనాల తనిఖీ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోలీసు ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు.

23న షానేషావలి ఉరుసు

శిరివెళ్ల, ఫిబ్రవరి 18: శిరివెళ్లలో వెలసిన హజరత్ సయ్యద్ షానేషావలి ఉరుసును ఈ నెల 23న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 22న గంధం, 23న ఉరుసు, 24న జారతలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'ఏడు గంటల విద్యుత్ ఒకేసారి ఇవ్వాలి'



రుద్రవరం సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రుద్రవరం, ఫిబ్రవరి 18: కోత లేకుండా ఏడు గంటల విద్యుత్ ఒకేసారి ఇవ్వాలంటూ కొండమాయపల్లె రైతులు ఆదివారం రుద్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ ఏడుగంటల్లో విద్యుత్ దఫదఫాలుగా ఇవ్వడంతో పారిన పొలానికి నీరు పారుతూనే ఉందని, మిగిలిన పొలం అలాగే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వాడుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసిస్టెంటు ఇంజనీర్ గౌడ్ స్పందిస్తూ మాట్లాడుతూ ఏడుగంటలు ఒకేసారి ఇచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు: టీడీపీ

బనగానపల్లె, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్లితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నందవరం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు నవరత్నాలు అని చెప్పి ఓట్లు దండుకొని గెలుచుకొని నవమోసాలు చేసిందన్నారు. మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతామని ప్రగల్బాలు పలికిన జగన్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని బీసీ ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ చార్జీలు, విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. చివరకు చెత్తపై పన్నువేసి చెత్తముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలి పోతారని విమర్శించారు. రెండు నెలలు ప్రజలు కలసికట్టుగా పనిచేసి ఈ అసమర్థ సీఎం జగన్‌ను ఇంటికి పంపాలని బీసీ పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీపీ. కుమార రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, బోయవెంగన్న, చింతమాను వలి, నడిపెన్నగారి రామ్మోహన్, బాల వెంకటేశ్వర్లు, నడిపి జంబులయ్య, టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పని ఖతం

కోవెలకుంట్ల: టీడీపీ- జనసేన పొత్తుతో సీఎం జగన్ పని ఖతం అవుతుందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని ముదిగేడు రస్తాలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి జనసేన జిల్లా నాయకుడు చింతాసురేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, టంగుటూరు శ్రీనయ్య, కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, జనసేనపార్టీ నాయకులు భాస్కర్, నాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

డోన్(రూరల్), ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో టీడీపీ, జనసేన ఉమ్మడి మినీ మేనిఫెస్టో కరపత్రాలను జనసేన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన కూటమితో ఏర్పడే ప్రభుత్వంలో అమలయ్యే సూపర్ సిక్స్ మేనిఫెస్టో పథకాల గురించి గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పరదేశి మహేష్, పులిశెట్టి రాయల్ మల్లికార్జున, ఎర్రగుంట్ల ఓబులేసు, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమేందుకు ప్రజలు సిద్ధం

● మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఫిబ్రవరి 18: అభివృద్ధికి ఆటంకంగా మారిన వైసీపీని వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం నుంచి తరిమేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సనమక్షంలో ఆదివారం టీడీపీలో చేరాయి. అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడి ఉందని ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని అన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబును సీఎంగా చేసుకుంటేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు పుష్కలంగా అందుతాయని అన్నారు. టీడీపీ నాయకులు, భార్గవ్‌రామ్ నాయుడు, కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళి, ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కమతం పుల్లారెడ్డి, కమతం లక్ష్మీరెడ్డి, సత్తారు లక్ష్మీరెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, కమతం సుబ్బారెడ్డి, తాళ్లూరి బుగ్గన్న, మండ్ల హుసేనప్ప, రామ్మోహన్, జాకీర్ హుసేన్, జమాల్ బాషా పాల్గొన్నారు.

'రాక్షస పాలనకు చరమగీతం పాడాలి'

చాగలమర్రి: రాష్ట్రంలోని వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న వైసీపీకి చెందిన 40 కుటుంబాలకు పైగా ఆదివారం సాయంత్రం అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. నాయకులు భార్గవ్‌రామ్, అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, లక్ష్మీనారాయణగౌడ్, మహబూబ్‌బాషా, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, ముల్లా అబ్దుల్లా, రఫిద్దీన్, శ్యాబా, అమీర్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి అఖిలప్రియ సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న మటన్‌మార్కెట్ వీధిలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీకార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె ఇంటింటికి వెళ్లి వైసీపీ పాలనతో ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. పట్టణంలో వైసీపీ కౌన్సిలర్ కుమారుడు డబ్బు కోసం బాలుడ్ని చంపేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. టీడీపీ హయాంలో ఇంటింటికి కొళాయి కోసం అమృత్ పథకాన్ని రూ.120 కోట్లతో ప్రారంభించామని, అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదని అన్నారు. కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, కౌన్సిలర్ హుసేన్‌బాషా, నూర్జహన్, రమిజా, సుబహని, అట్ల శ్రీదేవి, పూజిత, భాస్కర్, శివ పాల్గొన్నారు.

● పడకండ్ల గ్రామంలో టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఇంటింటి ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, మాజీ కౌన్సిలర్ శూలం నరసింహుడు, చింతకుంట రాంశేఖర్‌రెడ్డి, మద్దిలేటి. రామ్‌మద్దిలేటిరెడ్డి, సగిలి శ్రీనివాసరెడ్డి, ఆవుల రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచుల్లో ప్రజాస్వామ్యం

బేతంచెర్ల, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో జరిగే అరాచక పాలనతో ప్రమాదపు అంచుల్లో ప్రజాస్వామ్యం ఉందని ప్రజలు నియంత పాలనకు స్వస్తి పలికి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇంటికి రాచమార్గాన్ని ఏర్పాటు చేసుకున్నాడు కానీ.. దళిత గిరిజన మైనార్టీ వర్గాలు నివసించే ప్రాంతాలలో అభివృద్ధి శూన్యమని, మంత్రి బుగ్గనను ప్రజలు ఇంటికి సాగనంపడం ఖాయమని సుబ్బారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వరరెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, నియోజకవర్గ గౌరవ సలహాదారుడు తిరుమలేష్ చౌదరి, పట్టణ సమన్వయ కమిటి చైర్మన్ ఉన్నం సుధాకర్, బుగ్గానిపల్లె రమేష్, ముస్లీం మైనార్టీ నాయకులు జాకీరుల్లా భేగ్, ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, క్రిస్టియన్ కమిటి కార్యదర్శి మేకల నాగరాజు, రూబెన్, బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు, మాదినేని నారాయణ స్వామి, కౌన్సిలర్లు రామాంజనేయులు, రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు నిజాంగారి రామనాథం పాల్గొన్నారు.



నందవరంలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



చాగలమర్రిలో అఖిలప్రియ సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు



పోలీసుల స్థలంలో మంత్రి ఇంటిదారిని చూపుతున్న సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు



యర్రగుంట్లలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

పోలీసుల స్థలాన్ని కబ్జా చేసిన మంత్రి బుగ్గన

పట్టణంలోని ఉన్న పోలీస్ క్వార్టర్స్ స్థలాన్ని రాష్ట్ర మంత్రి బుగ్గన కబ్జా చేసి ఇంటికి దారి వేసుకోవడం, అసైన్డ్ భూములను దురాక్రమించి తన పొలాల మీదుగా రోడ్లు వేసుకోవడం ఎంత వరకు సమంజసమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల స్థలాలను కబ్జా చేస్తూ తన స్వార్థం కోసం రోడ్లు వేసి అభివృద్ధి చేశామంటూ బుగ్గన చెప్పడం హాస్యాస్పదంగా ఉందనా ఎద్దేవా చేశారు. సమావేశంలో నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకుడు పోలూరు రాఘవరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి మండల సమన్వయకర్త చంద్రశేఖర్, పట్టణ సమన్వయకర్త సుధాకర్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



తేజ సొసైటీ నిర్వాహకురాలను సన్మానిస్తున్న దృశ్యం

డోన్, ఫిబ్రవరి 18: డోన్ మండలంలోని మల్లెంపల్లె గ్రామంలో టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి చేతుల మీదుగా తేజ ఉమెన్ రూరల్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురు మహిళలకు కుట్టుమిషన్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో జీవనం సాగించేందుకు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తేజ ఉమెన్ రూరల్ అండ్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ చేస్తున్న కార్యక్రమాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తేజ సొసైటీ నిర్వాహకురాలు కృష్ణవేణి, సజ్జల దిన్నె జయన్న, సుంకన్న, శ్రీనివాసులు, సుధాకర్, క్రిష్ణ, ఎల్లరంగడు, సురేష్ సుంకన్న యాదవ్ పాల్గొన్నారు.

'ఘర్షణలకు పాల్పడితే చర్యలు'



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 18: గ్రామాల్లోని ప్రజలు ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ నరసింహులు హెచ్చరించారు. పల్లెనిద్రలో భాగంగా రానున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్న సూచనలతో ఆళ్లగడ్డ మండలంలోని కొండంపల్లె గ్రామస్తులతో ఆదివారం మాట్లాడారు. గ్రామంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

● గంటల తరబడి నిరీక్షణ



చాగలమర్రి అడ్డవాగు వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

చాగలమర్రి, ఫిబ్రవరి 18: ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార వైసీపీ తలపెట్టిన రాజకీయ ప్రచారంలో భాగంగా అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు తీసుకెళ్లడంతో ఆదివారం ప్రయాణికులు అవస్థలు పడ్డారు. బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో నుంచి బస్సులను సిద్ధం సభకు తీసుకెళ్లడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు తక్కువై ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వైసీపీ సభల పేరిట, బస్సు సర్వీసులను రద్దు చేయడంపై ప్రయాణికులు మండిపడ్డారు. చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల, అడ్డవాగు, పలు రహదారుల్లో ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షణ చేయాల్సి వచ్చింది.

క్షుద్రపూజల కలకలం



రుద్రవరం, ఫిబ్రవరి 18: మండలంలోని రెడ్డిపల్లె - తూపల్లె గ్రామాల మధ్య శనివారం రాత్రి ముగ్గులు వేసి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేయడంతో ఆదివారం ఉదయం కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు రెండు గ్రామాల మధ్య ముగ్గులతో పాటు నిమ్మకాయలు, టెంకాయలు పలు రకాల వస్తువులు అక్కడ వదిలేశారు.

నాయకుల నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 18: మండలంలోని ఇంజేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మారంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తల్లి రామలక్షుమ్మ (82) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె మృతికి మాజీమంత్రి భూమా అఖిలప్రియ, టీడీపీ యువ నాయకుడు జగద్విఖ్యాత్‌రెడ్డి, బీజేపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి నివాళి అర్పించారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్ రెడ్డి, మండల కన్వీనరు కుడాల నారాయణరెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం



కొత్తకోటలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గౌతమ్ రెడ్డి

డోన్, ఫిబ్రవరి 18: మండలంలోని కొత్తకోట గ్రామంలో టీడీపీ కార్యకర్త శివ మృతికి ఆదివారం నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని గౌతమ్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



మూడురాళ్లపల్లెలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, ఫిబ్రవరి 18: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వేంకటేశ్వర, సాయిబాబా, వీరభద్ర, ఆంజనేయస్వామి విగ్రహాల ధ్వజప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వేద పండితులు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ధ్వజ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం, గోదర్శనం పూజలు నిర్వహించారు. ఆలయాల ముందు ధ్వజ ప్రతిష్ఠ, ఆలయాల లోపల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులచే గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బీజేపీ ఆళ్లగడ్డ ఇన్‌చార్జి భూమా కిషోర్‌రెడ్డి దేవతా మూర్తులకు పూజలు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అరుణాదేవి, మాజీ జడ్పీటీసీ పులి వీరమ్మ వేంకటేశ్వరస్వామి, సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

భూమా జగత్ పూజలు



పూజలు చేస్తున్న విఖ్యాతరెడ్డి

మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో నూతన ఆలయాల ధ్వజ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, ఆదివారం ఉత్సవాల్లో పాల్గొన్నారు.వేంకటేశ్వర స్వామి, సాయిబాబా, వీరభద్ర, ఆంజనేయస్వామి విగ్రహాలకు భూమా జగత్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితులు ఆయనకు శాలువ, పూలమాలలతో సన్మానించి ఆశీర్వచనాలు పలికారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఓబుళరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తులకు అభిషేకం



లక్ష్మినరసింహస్వామి ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, ఫిబ్రవరి 18: పార్వేట పల్లకీలో కొలువుదీరి అహోబిళ క్షేత్రం నుంచి జనవరి 16న బయల్దేరిన ఉత్సవమూర్తులకు మండలంలోని చందలూరు గ్రామంలో ఆదివారం అహోబిళ ప్రధాన అర్చకుడు వేణుగోపాళం క్షీర, గంధాది ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పార్వేట పల్లకిలో కొలువుదీరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద ఉత్సవమూర్తులకు చందలూరులో ఆనవాయితీగా అభిషేకం చేస్తున్నట్లు ప్రధాన అర్చకులు తెలిపారు. పార్వేట పల్లకిలో కొలువుదీరి అలసిపోయిన ఉత్సవమూర్తులకు ఇలా అభిషేకం చేయడం ఆనవాయితీ అని చెప్పారు. గ్రామానికి చెందిన కరణం అయ్యగారు ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలను బహూకరించారు. అనంతరం వీఆర్వో పక్రుద్దీన్, కార్యదర్శి ఓబులేసు ప్రత్యేక పూజలు చేశారు.

లింగమయ్య స్వామికి పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 18: మండలంలోని ముత్తలూరు గ్రామం సమీపంలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు.

గ్రామ దేవతలకు..

మండలంలోని కొండమాయపల్లె, యల్లావత్తుల చిన్నకంబలూరు రుద్రవరం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

సంతాన వేణుగోపాలుడికి ..

రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామి సత్యభామ రుక్మిణీ అమ్మవార్లకు నాలుగు రాష్ట్రాల భక్తులు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆదివారం అర్చకుడు నిత్యతృప్తదాస్ తెలిపారు. నాలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఒకేసారి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు చెందిన 40 మంది ఒకేసారి తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తులసిబృందావనం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రేపటి నుంచి ఆలయ ప్రతిష్ఠ వేడుకలు



శిరివెళ్ల, ఫిబ్రవరి 18: శిరివెళ్లలో జీర్ణోద్ధరణ చేసిన అన్నపూర్ణా విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర-బసవేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలను ఈ నెల 20వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా 20న గణపతి పూజ, రక్షాబంధనం, నవగ్రహ హోమం, 21న ప్రతిష్ఠామూర్తులకు ధాన్యాధివాసం, అధివాసాంగ హోమాలు, 22న గోపూజనము, యంత్ర స్థాపనం, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే 20న సాయంత్రం సంకీర్తనా మహా యజ్ఞములో భాగంగా కోలాటం, 21న మధ్యాహ్నం నందికోల సేవలతో ప్రతిష్ఠామూర్తులకు గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పుట్టాలమ్మకు..

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 18: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో వెలసిన అమ్మవారికి భక్తులు ఆదివారం పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తలనీలాలు సమర్పించుకొని కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు ఆలయ వేదపండితులు అన్నదానం చేశారు.